# పేరాశ



రాజా వెంకటాద్రి నాయనింగారు అమరావతిని రాజధానిగా చేసుకొని తెలుగు దేశాన్ని పరిపాలిస్తున్న కాలంలో, ముమ్మనాచార్యుల వారు న్యాయాధిపతిగానూ, ప్రభువులకు అంతరంగిక సచివులుగానూ పనిచేస్తూ ఉండేవారు.

ముమ్మనాచార్యులవారు మహాపండితులు. మంత్రశాస్త్రంలోనూ, న్యాయశాస్త్రంలోనూ వారిని కాదనిపించగలవారు ఆ రోజుల్లో లేరు. వారు సిద్ధులు, వాక్శుద్ధికలవారు, వారి మాటకు తిరుగులేదు.

ఈ విషయాలన్నీ శివదత్తుడనే మరొక పూజారికి తెలిశాయి. ఏదో విధంగా ముమ్మనాచార్యుల వారి దయను సంపాదించుకోవడం

అవసరమని శివదత్తుడు భావించాడు. ముమ్మనాచార్యుల వారు దేవి ప్రసన్నం గలవారు గనుక, తనకు సిరిసంపదలు కలగాలని వరమిచ్చినా ఇవ్వవచ్చు. లేదా ప్రభువుతో చెప్పి, మడిమాన్యాలిప్పించినా తనకుబాగే. తను అనేక సంవత్సరాలుగా దారిద్ర్యం అనుభవించాడు. జీవితంలో సుఖమంటే ఎలా ఉంటుందో కూడా తను ఎరగడు. కనీసం ఈ చివరి రోజుల్లో అయినా సుఖపడి కన్నుమూస్తే ఈ జీవితానికిక చాలు.

శివదత్తుడు అతి ప్రయాసమీద ముమ్మనాచార్యులవారిని దర్శించ గలిగాడు.

ఆచార్యులవారు అప్పుడే పూజాదికాలు ముగించుకొని ముందుకు వచ్చారు. శివదత్తుని చూస్తూనే అతను వచ్చిన పనిని గ్రహించారు. కూతురిని పిలిచి పూజామందిరంలో ఉండే రాగిపాత్రను తీసుకు రమ్మన్నారు. ఆ పాత్రను శివదత్తునకిస్తూ, ముమ్మనాచార్యులవారు ఇలా అన్నారు—

"నాయనా! ఈ రాగిపాత్రను నీదగ్గరుంచుకో. ఈ పాత్ర ప్రతి రోజు నీకొక రత్నాన్నిస్తుంది. నీక్కావలసిన రత్నాలు పోగుపడ్డాక ఈ పాత్రను ఇంకెవరికన్నా ఇచ్చెయ్యి. అయితే మరో చిన్నపని కూడా నీవు చెయ్యాలి. రాగిపాత్రను ఇంకొకరికిచ్చినదాకా నీ దగ్గరున్న రత్నాలను వాడుకోడానికి వీలుండదు. అలా వాడుకోవడం ప్రారంభించిన మరునాటి నుండి రాగిపాత్ర నుండి రత్నాలు రావడం కూడా నిలిచి

పోతుంది. ఇదిగో ఈ పాత్ర తీసుకో. సుఖపడు" అంటూ దీవించి పంపేశారు ముమ్మనాచార్యులవారు!

శివదత్తుని ఆనందానికి మేరలు లేవు. అతను గాలిలో తేలిపోతూ ఇంటికొచ్చాడు. ఆ పాత్ర సంగతి చాలా రహస్యంగా ఉంచాడు. ఆ రాత్రి శివదత్తునికి నిద్రరాలేదు. ఖాళీగా ఉన్న ఆ పాత్ర నుండి రత్నం ఎలా వస్తుందో చూడాలన్న కోరిక అతనిలో బలంగా చెలరేగింది. కను రెప్ప కూడా వల్చకుండా దానిలోకే చూస్తూ కూచున్నాడు. సూర్యో దయం వేళను పాత్ర అడుగున వెలుగు కనిపించింది. పాత్రను బోర్లించి చూశాడు. అది రత్నమే!

రోజులు, వారాలు, నెలలు, సంవత్సరాలూ గడిచాయి. శివదత్తుని పూరికొంప రత్నాల రాసులతో నిండి పోయింది. కానీ అతను పిడికెడు తిండి కూడా లేక నకనకలాడిపోతున్నాడు. ఓ రత్నాన్ని అమ్ముకొంటే హాయిగా జీవించవచ్చు. కానీ పాత్ర నుండి మరింక రత్నాలు రావు. రత్నాల మీది ఆశతో శివదత్తుడు వాటిని అనుభవించకుండానే కన్ను మూశాడు పాపం!